ఎర్రగడ్డ రైతుబజార్‌లో కూరగాయల ధరలు

సనత్‌నగర్: టమాటా రూ.13, నల్లవంకాయ 18, పొడుగు వంకాయ 18, బెండకాయ 35, పచ్చిమిర్చి 35, బజ్జీమిర్చి 28, క్యాప్సికమ్ 45, పచ్చకాకర 38, పందిరి బీర 45, క్యాబేజీ 13, క్యారెట్ 31, దొండ 23, గుండుబీన్స్ 85, గింజ చిక్కుడు 65, గోకరకాయ 35, కీర 23, దోసకాయ 15, బీట్‌రూట్ 17, ఉల్లిగడ్డ 16, ఆలుగడ్డ 24, చామగడ్డ 35, మొరంగడ్డ 18, కందగడ్డ 65, సొరకాయ 9, పొట్లకాయ 23, అరటికాయ 11, మునగకాయ 3–4, ముల్లంగి 5–6. ఈ ధరలు శనివారం ఉదయం 9 గంటల వరకు అమల్లో ఉంటాయి.

సీఎంఆర్‌ఎఫ్ ఎల్వోసీల అందజేత


ఎల్వోసీల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: లాలాగూడకు చెందిన వసంత, తుకారాంగేట్‌కు చెందిన మణెమ్మ అనారోగ్యంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సీఎంఆర్‌ఎఫ్ పథకం కింద వారికి రూ. 3 లక్షలు మంజూరు చేయించి సంబంధిత ఎల్వోసీ పత్రాలను సీతాఫల్‌మండిలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం అందించారు.

జూలైలో 'తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్'

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ హిస్టరీ కాంగ్రెస్ 8వ సమావేశాలు జూలై 25, 26 తేదీల్లో వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో జరగనున్నాయి. ఆర్ట్స్ కాలేజీ చరిత్ర విభాగంలో సంబంధిత బ్రోచర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. తెలంగాణ చరిత్రపై శాస్త్రీయ పరిశోధనలను ప్రోత్సహిస్తూ చరిత్ర వాస్తవ ఆధారంగా కొనసాగించడం హిస్టరీ కాంగ్రెస్ ముఖ్య ఉద్దేశం అన్నారు.

హిస్టరీ కాంగ్రెస్ నూతన కార్యవర్గం

హిస్టరీ కాంగ్రెస్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రొ.సుదర్శన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా అంకం జయప్రకాశ్, ఉపాధ్యక్షులుగా ప్రొ.సుధారాణి, ప్రొ.లావణ్య, సంయుక్త కార్యదర్శులుగా ప్రొ.మనోహర్, ప్రొ.దయాకర్, కోశాధికారిగా డా.బండి శ్రీనివాస్, లోకల్ సెక్రెటరీగా పీవీ ఈశ్వర్ నియమితులైనట్లు తెలిపారు.

కుమార్తెను అమెరికా నుంచి రప్పించాలని తండ్రి వేడుకోలు

పంజగుట్ట: భర్త పెట్టే చిత్రహింసలు భరించలేక, అమెరికాలో చిక్కుకున్న తన కుమార్తెను కాపాడాలని ఓ తండ్రి వేడుకుంటున్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో బాధితుడు గులాం అఫ్జల్, న్యాయవాది విజయ్‌కుమార్ మాట్లాడుతూ.. తన కూతురు ఫాతిమా హస్నాకు 2007లో గుల్బర్గాకు చెందిన డబీరుద్దీన్ అనే డాక్టర్‌తో వివాహం జరిగిందన్నారు. పెళ్లి తర్వాత అమెరికాకు వెళ్లి 58 రోజులపాటు బాగానే ఉన్నారని తెలిపారు. తర్వాత డబీరుద్దీన్ కేవలం అమెరికా వెళ్లేందుకే ఫాతిమాను వివాహం చేసుకున్నట్లు తెలియడంతో ఇద్దరి మధ్య తగాదాలు జరిగాయన్నారు. దీంతో వెంటనే ఆమె భారతదేశానికి వచ్చి అతనిపై కేసులు వేసి చట్టపరంగా విడాకులు తీసుకున్నారని తెలిపారు. ఉద్యోగ కోసం తిరిగి అమెరికాకు వెళ్లిన ఫాతిమాను డబీరుద్దీన్ వేధింపులకు గురిచేయడమే కాకుండా తనను మోసం చేసి అమెరికాకు తీసుకువచ్చిందని అక్కడ తప్పుడు కేసులు పెట్టాడని తెలిపారు. దీంతో అమెరికా చట్టం ప్రకారం ఆమెపై కేసు నమోదు చేసి డబీరుద్దీన్‌కే భరణం ఇవ్వాలని చెప్పడంతో గత పదేళ్లుగా ఫాతిమా ఉద్యోగం చేస్తూ భరణం ఇస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆమెపై కేసులు ఉండడంతో ఇండియాకు రాలేని పరిస్థితి ఉందని అటు భరణం ఇవ్వలేక తన పింఛన్ డబ్బులు కూడా పంపించాల్సి వస్తుందని గులాం అఫ్జల్ వాపోయారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తన కుమార్తెను భారత్‌కు రప్పించాలని, అలానే డబీరుద్దీన్‌పై కూడా ఇక్కడ తన కూతురు పెట్టిన కేసులు ఉన్నందున అతన్ని కూడా ఇండియాకు రప్పించాలని విజ్ఞప్తి చేశారు.

కొండా లక్ష్మణ్ బాపూజీని జాతిపితగా ప్రకటించాలి

పంజగుట్ట: అన్ని ఉద్యమాలతో సంబంధం ఉన్న ఉద్యమాల పెద్దన్న ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ అని ఆయనను తెలంగాణ జాతిపితగా రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలని కొండా లక్ష్మణ్ బాపూజీ ఫెడరేషన్ వ్యవస్థాపకుడు రాపోల్ జ్ఞానేశ్వర్ ప్రభుత్వాన్ని కోరారు. ఫెడరేషన్ ఆధ్వర్యంలో జూన్ 2వ తేదీన జలదృశ్యంలో తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు, బాపూజీని తెలంగాణ జాతిపితగా ప్రకటించుకుని గౌరవించుకోనున్నట్లు ఆయన తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో జూన్ 2వ తేదీన జరగనున్న కార్యక్రమ పోస్టర్‌ను ఫెడరేషన్ ప్రధానకార్యదర్శి జగదీష్, సామాజిక తెలంగాణ వేదిక అధ్యక్షులు నిమ్మల వీరన్న, జాతీయ బీసీ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యంతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... దేశ స్వాతంత్ర్య పోరాటం సహా తెలంగాణ తొలిదశ, మలి దశ ఉద్యమంలో పాల్గొన్న కొండా లక్ష్మణ్ బాపూజీని గౌరవించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

నిర్మించి..వదిలేశారు..!

• నిరుపయోగంగా మరుగుదొడ్లు • రూ.1.50 కోట్లు ప్రజాధనం వృథా • లష్కర్‌లో జీహెచ్‌ఎంసీ తీరు

సికింద్రాబాద్: సికింద్రాబాద్ ప్రాంతంలో ప్రజల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన మరుగుదొడ్లు నిర్వహణ లేక నిరుపయోగంగా మారాయి. కొన్ని రహదారులను ఎంపిక చేసి ఆయా రోడ్లలోని నిర్దేశిత స్థలాల్లో గత ఆరేళ్లలో మూడుసార్లు టాయ్‌లెట్లు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ లేక అవి కనుమరుగయ్యాయి. అంతేగాకుండా వాటిలో ఏర్పాటు చేసిన బయో టాయ్‌లెట్ల పరికరాలు పూర్తిగా తుప్పుపట్టి నామరూపాలు లేకుండాపోయాయి. మరోవైపు అవే ప్రదేశాల్లో రెండేళ్ల క్రితం సిమెంట్ గోడలతో నిర్మించిన సాధారణ మరుగుదొడ్లు సైతం నిరుపయోగంగా మారి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి.

రూ.1.50 కోట్లు వృథా..

గతంలో జీహెచ్‌ఎంసీ రూ. కోటి నిధులు వెచ్చించి 23 చోట్ల బయో టాయ్‌లెట్లు ఏర్పాటు చేసింది. ఆ తర్వాత వాటి స్థలాల్లోనే సిమెంట్ కట్టడాల నిర్మాణానికి మరో రూ.50 లక్షలు వెచ్చించారు. ఇప్పుడు వాటిని వినియోగంలోకి తీసుకురాకపోవడంతో అవన్నీ వృథా అయినట్లేనని పలువురు వాపోతున్నారు.

23 ప్రాంతాల్లో ఇవే సమస్యలు..

సికింద్రాబాద్ ప్రాంతంలో 23 ప్రాంతాలను ఎంపిక చేసిన జీహెచ్‌ఎంసీ అధికారులు తొలుత సర్వాంగ సుందరంగా, అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన బయోటాయ్‌లెట్ల ఏర్పాటుపై మొదట్లో ఇక్కడి ప్రజల్లో హర్షం వ్యక్తమయ్యింది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా అవి ప్రారంభానికి కూడా నోచుకోలేదు. ఆ తర్వాత మళ్లీ అవే ప్రాంతాల్లో సాధారణ టాయ్‌లెట్లు నిర్మించి రెండేళ్లు కావస్తున్న నిరుపయోగంగా ఉండడం గమనార్హం. టాయ్‌లెట్లు నిర్మిస్తున్నా.. అధికారులు వాటికి నీటి సరఫరా, డ్రైనేజీ లైన్లు ఏర్పాటు చేయని ఫలితంగానే అవి అందుబాటులోకి రాకుండా నిరుపయోగంగా ఉంటున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకువస్తే ఇబ్బందుల్లేకుండా ఉంటుందని ప్రజలు కోరుతున్నారు.



చిలకలగూడ ప్రధాన రహదారిలో బయోటాయిలెట్ (ఫైల్)


అదే స్థలంలో నూతనంగా నిర్మించిన సాధారణ మరుగుదొడ్డి

కార్పొరేటర్లతో జోనల్ కమిషనర్ సమీక్ష



కార్పొరేటర్లతో సమీక్షిస్తున్న జోనల్ కమిషనర్ రవికుమార్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రవికుమార్, అధికారులు, కార్పొరేటర్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. వచ్చే వన మహోత్సవంలో సాధ్యమైన వరకు ఎక్కువ మొక్కలు నాటాలని ఇంటింటికీ వెళ్లి మొక్కలు పెంచేందుకు తగిన చర్యలు చేపట్టాలని కార్పొరేటర్లు కోరారు. వీధిలైట్ల విషయంలో గతంలో ఈఈ, ఎస్ఎల్ వలన విద్యుత్ దీపాలు సరిగా పనిచేయలేదని ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ద్వారా పనులు చేపట్టాలని, అలాగే వీధి కుక్కలు విషయంలో చాలా ఇబ్బందులు పడుతున్నామని దీనిపై వెటర్నరీ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని విన్నవించారు. వర్షాకాలంలో దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందు పిచికారీ చేయాలని ఎంటామాలజీ అధికారులను కోరారు. ఆయా డివిజన్లలో సీసీ రోడ్లు, డ్రైనేజీ పనుల విషయంలో చర్చించాలని, తమ కాలనీలో డీసిల్టింగ్ పనులు ఇంకా చాలా మిగిలి ఉన్నాయని వచ్చే వర్షాకాలంలో ముంపు వలన ఆటంకాలు కలగకుండా పనులు వేగవంతం చేయాలని అధికారులను కోరారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, కార్పొరేటర్లు, ఎస్ఈ ఆశాలత, సిటీ ప్లానర్ శ్రీనివాస్‌రెడ్డి, డీడీ వెటర్నరీ చక్రపాణి, డీడీ హార్టికల్చర్ అనిల్, జోనల్‌కు సంబంధించిన డిప్యూటీ కమిషనర్లు పలు విభాగాలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

పరిశోధనల కోసమే ఆదిధ్వని మ్యూజియం


మాట్లాడుతున్న మెడ శ్రీనివాస్

ఉస్మానియా యూనివర్సిటీ: నాగరిక ప్రజలు ఆదివాసుల జీవన విధానం, సంస్కృతి సాంప్రదాయాలు తెలుసుకునేందుకు ఓయూ క్యాంపస్‌లో ఆది ధ్వని మ్యూజియం ఏర్పాటు చేయనుండడంపై ఎన్ఎస్‌యూఐ అధ్యక్షుడు మెడ శ్రీనివాస్ హర్షం వ్యక్తం చేశారు. ఓయూలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. విశ్రాంత అధ్యాపకుడు ప్రొ.జయధీర్ తిరుమల రావు ఆది ధ్వని మ్యూజియం కోసం చేస్తున్న కృషిని అభినందించారు. శిథిలావస్థలో ఉన్న ఓయూ క్వార్టర్లను మరమ్మతు చేసి మ్యూజియాన్ని ఏర్పాటు చేయడం వల్ల నష్టం లేదన్నారు. ఓయూ భూములను కాపాడడంలో ఎన్ఎస్‌యూఐ ఎప్పుడూ ముందు ఉంటుందని, కానీ పరిశోధన విద్యార్థులకు ఉపయోగపడే ఆది ధ్వని మ్యూజియాన్ని అడ్డుకోవడం తగదని ఆయన పేర్కొన్నారు.

'గురుకులాల సెక్రటరీ వర్షిణిపై చర్యలు తీసుకోవాలి'

లాలాపేట: సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలల్లోని ఎస్సీ, ఎస్టీ విద్యార్థులపై ఆ సంస్థల సెక్రటరీ వర్షిణి వ్యాఖ్యలను స్వేరోస్ నగర కార్యదర్శి కుమార్ షాను ఖండించారు. తార్నాకలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులే బాత్‌రూంలు క్లీన్ చేసుకోవాలి, వంట చేసుకోవాలి, ఊడ్చుకోవాలంటూ ఆమె మాట్లాడిన మాటలు విద్యార్థుల పేదరికాన్ని ఎత్తి చూపేలా ఉన్నాయన్నారు. బాధ్యతగల అధికారి ఇలా మాట్లాడడం సిగ్గు చేటు అన్నారు. దీనికి రాష్ట్ర ప్రభుత్వం బాధ్యత వహిస్తూ వెంటనే ఆమెను గురుకులాల సెక్రటరీ పదవి నుంచి తొలగించి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

గురుకుల సెక్రటరీ వ్యాఖ్యలు తగవు

ఉస్మానియా యూనివర్సిటీ: గురుకుల సెక్రటరీ అలుగు వర్షిణి వ్యాఖ్యలపై ఓయూ విద్యార్థి నేతలు శుక్రవారం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఐఏఎస్ హోదా గల అధికారి గురుకులాల్లో చదివే విద్యార్థులు మరుగుదొడ్లు, స్నానాల గదులు శుభ్రం చేసుకుంటే తప్పేంటని మాట్లాడడం సరికాదన్నారు. ఆమెను వెంటనే విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంసా ఓయూ అధ్యక్షుడు నామ సైదులు, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు గ్యార నరేశ్, మాల సంఘాల జేఏసీ నాయకులు మాదాసు రాహుల్, మాసంపల్లి శ్రీకాంత్, మదునూరి రాహుల్, దివాకర్, సతీశ్, రమేశ్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు కృషి


కేక్ కట్ చేస్తున్న డా.జనగామ సంతోష్

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ అభివృద్ధికి మంత్రి శ్రీధర్ బాబు ఎంతో కృషి చేస్తున్నారని టీజీఆర్‌ఎస్‌ఏ ప్రధాన కార్యదర్శి డా.జనగామ సంతోష్ అన్నారు. టీజీఆర్‌ఎస్‌ఏ ఆధ్వర్యంలో ఆర్ట్స్ కాలేజీ ఎదుట మంత్రి జన్మదిన వేడుకలను విద్యార్థులు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి కోసం విదేశాల నుంచి అనేక పెట్టుబడులను రాబట్టడంతో పాటు పరిశ్రమల స్థాపనకు చొరవ తీసుకుంటున్నారన్నారు. మంత్రి శ్రీధర్ బాబు నేటి తరం యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో టీజీఆర్‌ఏ అధ్యక్షుడు పొన్నం ముత్యంగౌడ్, చైర్మన్ దూడపాక సురేశ్, టీవీయూవీ చైర్మన్ కంచర్ల బద్రి, కమలాకర్, పులిగంటి సురేశ్, కిరణ్ పాల్గొన్నారు.

మర్రి శశిధర్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి రవీందర్‌రెడ్డి కన్నుమూత



సనత్‌నగర్: మాజీ ముఖ్యమంత్రి మర్రి చెన్నారెడ్డి హయాం నుంచి ఇప్పటిదాకా ఆయన కుటుంబానికి వ్యక్తిగత కార్యదర్శిగా పనిచేసిన రవీందర్‌రెడ్డి (74) శుక్రవారం కన్నుమూశారు. ఈ ఏడాది మార్చి 3వ తేదీన రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన కోమాలోకి వెళ్లారు. దాదాపు మూడు నెలల పాటు ఆస్పత్రిలో మృత్యువుతో పోరాడి తుది శ్వాస విడిచారు. చివరి వరకు మాజీ మంత్రి, సనత్‌నగర్ మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డికి వ్యక్తిగత కార్యదర్శిగా ఉన్నారు. మార్చి 3న బేగంపేటలోని కార్యాలయం నుంచి బైక్‌పై కోకాపేటలోని తన ఇంటికి వెళ్తుండగా రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. శనివారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని మహాప్రస్థానంలో రవీందర్‌రెడ్డి అంత్యక్రియలు జరగనున్నాయి. ఆయన భౌతికకాయాన్ని మర్రి శశిధర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు.

బీజేపీ నూతన కమిటీల నియామకం


అడ్డగుట్ట డివిజన్ బీజేపీ నూతన కమిటీ

అడ్డగుట్ట: అడ్డగుట్ట డివిజన్ బీజేపీ కమిటీని జిల్లా అధ్యక్షుడు భారత్ గౌడ్ ప్రకటించినట్లు డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య తెలిపారు. ఉపాధ్యక్షులుగా శ్రీధర్, దుర్గ, చిరంజీవి, వసంత నాయక్, ప్రధాన కార్యదర్శులుగా గంభీరావుపేట్ సాయన్న, శివ ప్రసాద్, కార్యదర్శులుగా జ్ఞానేశ్వర్, విజయ్ కుమార్, లక్ష్మణ్, కల్యాణి, కోశాధికారిగా మోహన్‌ను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా డివిజన్ అధ్యక్షురాలు సౌందర్య మాట్లాడుతూ.. పార్టీ బలోపేతంతో పాటు డివిజన్‌లోని సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్‌కు నూతన కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మెట్టుగూడ డివిజన్ బీజేపీ కమిటీ..

సికింద్రాబాద్: మెట్టుగూడ డివిజన్ బీజేపీ నూతన కమిటీని మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ సమక్షంలో శుక్రవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఆదర్శ్ ముదిరాజ్, ఉపాధ్యక్షులుగా ఉదయ్ కుమార్, కె.రమేశ్,రాజేశ్ నాయుడు,శశికళ, ప్రధాన కార్యదర్శులుగా వరుణ్ కుమార్ యాదవ్, మహేందర్, కోశాధికారిగా అనంత లక్ష్మి, కార్యదర్శులుగా శ్రీనివాస్ రావు, కిరణ్, పవన్‌కుమార్, శ్రీనివాస్‌రావును నియమించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భరత్ గౌడ్ మాట్లాడుతూ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నూతన కమిటీ సభ్యులకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి గారు, సికింద్రాబాద్ అసెంబ్లీ కన్వీనర్ నాగేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.


కమిటీకి నియామకపత్రం అందజేస్తున్న జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్

నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యం


సంతోష్ యాదవ్ దంపతులను సత్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేశ్

కంటోన్మెంట్: నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. వెస్ట్ మారేడ్‌పల్లి పరిధిలోని నెహ్రూనగర్ పార్క్‌లో డివిజన్ కాంగ్రెస్ నాయకుడు సంతోష్ యాదవ్ సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తాగునీటికి ఇబ్బందుల్లేకుండా రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నిధులు మంజూరు చేయించి, రిజర్వాయర్ల నిర్మాణానికి కృషి చేస్తున్నానన్నారు. కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు, విఠలేశ్వర స్వామి టెంపుల్ చైర్మన్ గౌరీ శంకర్, డివిజన్ కాంగ్రెస్ నాయకులు వైష్ణవి, నగేశ్ యాదవ్, నందికంటి రవి బాబూరావు, వెంకట్రాజు, బాబూరావు ముదిరాజ్, దేవేందర్, పంగ రాజయ్య, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి


తహసీల్దార్ భీమయ్యకు వినతిపత్రం ఇస్తున్న యాదగిరి తదితరులు

అడ్డగుట్ట: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి గుర్తింపు కార్డులు అందించాలని తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ఎస్. యాదగిరి కోరారు. ఈ మేరకు శుక్రవారం కమిటీ ప్రతినిధులతో కలిసి మారేడ్‌పల్లి తహసీల్దార్ భీమయ్యగౌడ్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉద్యమకారులకు 250 గజాల్లో ఇల్లు నిర్మాణంతో పాటు ప్రతినెల రూ. 30 వేల గౌరవ వేతనం ఇవ్వాలని కోరారు. అంతేగాకుండా 100 ఎకరాల్లో అమర వీరుల స్మృతి వనాన్ని ఏర్పాటు చేయాలని, మలిదశ ఉద్యమంలోనూ 1200 మంది అమరులయ్యారని, వారి కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుందన్నారు. టీయూజేఏసీ రాష్ట్ర చైర్మన్ సుల్తాన్ యాదగిరి, ప్రతినిధులు మహమ్మద్, దేవయ్య, మురళి, అంజమ్మ, వెంకటలక్ష్మి, కిష్టయ్య, స్వరూప, కోటేశ్వరరావు, రవీందర్, సునీత, యాదగిరి, ఎల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి


బస్తీ దవాఖానలో సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ హేమ

సికింద్రాబాద్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నానని సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ అన్నారు. వారాసిగూడ, ఇందిరనగర్‌లో అధికారులతో కలిసి శుక్రవారం పర్యటించారు. వారాసీగూడ మీన బేకరి గల్లీలో ఓవర్ ఫ్లో సమస్య ఉందని స్థానికులు ఆమె దృష్టికి తీసుకురాగా, పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. త్వరలోనే శాశ్వత పరిష్కారం కూడా చూపుతామని హామీనిచ్చారు.

బస్తీ దవాఖాన సందర్శన..

ఇందిరానగర్‌లోని బస్తీ దవాఖానను కార్పొరేటర్ సామల హేమ శుక్రవారం సందర్శించారు. మందులు, సామగ్రి, వసతులపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దవాఖానకు మరమ్మతులు చేయాల్సి ఉందని వైద్యులు ఆమె దృష్టికి తీసుకురాగా, వెంటనే జీహెచ్‌ఎంసీ ఏఈతో మాట్లాడి మరమ్మతులు చేయాలని కోరారు. కార్యక్రమంలో వాటర్ వర్క్స్ మేనేజర్ కుషాల్, ఏఈ కౌశిక్, బస్తీ దవాఖాన మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సృజల తదితరులు పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత


ఎమ్మెల్యేతో హ్యూమన్ రైట్స్, సోషల్ జస్టిస్ కమిటీ సభ్యులు

కంటోన్మెంట్: మానవ హక్కుల పరిరక్షణ అందని బాధ్యతని ఎమ్మెల్యే శ్రీగణేశ్ అన్నారు. నేషనల్ హ్యూమాన్ రైట్స్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు బి. సలేందర్, వైస్ చైర్మన్ నిరుడు అశోక్ కుమార్ ఆధ్వర్యంలో ప్రతినిధులు క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సంస్థ పనితీరు, సేవలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. అభాగ్యులు, అట్టడుగు వర్గాల హక్కుల పరిరక్షణకు పాటుపడాలని సూచించారు. సేవా కార్యక్రమాలతో పాటు ప్రజా సమస్యల పరిష్కారంపైనా దృష్టి పెట్టాలన్నారు. కమిటీ సభ్యులు కే గోమతి, గడ్డి మాధవి, డి సురేఖ, కవిత, మమత, సబిత, మీనాభాస్కర్, వసంతి తదితరులు ఉన్నారు.

పెయింటింగ్, నృత్యం, స్కిట్ పోటీల విజేతలు

సనత్‌నగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా సనత్‌నగర్‌లోని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) ఆడిటోరియంలో నిర్వహించిన పెయింటింగ్, నృత్యం, స్కిట్ పోటీల విజేతలను శుక్రవారం ప్రకటించారు. టీజీపీసీబీ ఆధ్వర్యంలో 'ప్లాస్టిక్ కాలుష్యం–ఇంధన పరిరక్షణ'పై గత 21 నుంచి 23 వరకు 3 రజుల పాటు పోటీలు నిర్వహించిన విషయం విదితమే. పెయింటింగ్ జూనియర్, సీనియర్ విభాగాల్లో మొదటి బహుమతి ఐవీఎస్ నందిత (సెయింట్ థెరిస్సా స్కూల్), విశ్వతేజ్ (శ్రీచైతన్య–సుచిత్ర), చేతన్ వెజెండ్ల (గ్లోబల్ ఎడ్యుకేషన్ స్కూల్), సావియా (కీస్ హైస్కూల్), లోహిత (కిడ్స్ వరల్డ్ మాంటిస్సోరి స్కూల్–జిల్లెలగూడ), రిషిజ (కేవీఎస్–బేగంపేట్), బి.సేనారెడ్డి (లోటస్ ల్యాప్ పబ్లిక్ స్కూల్), కౌశిక్‌నాయక్ (జీహెచ్ఎస్ యూసుఫ్‌గూడ), జగన్నాథ్ (సిస్టర్ నివేదిత), ఏఆర్ అభిప్రీతి (గౌతమ్ మోడల్ స్కూల్)లు సాధించారు. స్కిట్ పోటీల్లో ప్రథమ బహుమతిని జాగృతి అభ్యుదయ సంఘం, సాహెబ్‌నగర్ జెడ్పీహెచ్ఎస్‌కు చెందిన జీవన, చంద్రశేఖర్, మణికంఠ, అనూష బృందం సాధించింది. వీరితో పాటు ద్వితీయ, తృతీయ బహుమతులను కూడా ప్రకటించారు. వీరికి జూన్ 5న జరిగే ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పీసీబీ కార్యాలయంలో బహుమతులు ప్రదానం చేయనున్నారు.

టీజీ సీపీజీఈటీ-2025 ఇంకెప్పుడో..?

• పరీక్షలు..ఫలితాలు..తరగతులు జాప్యం • ఏటా ఇదే తంతు • గాడి తప్పిన పీజీ కోర్సుల విద్యా సంవత్సరం • పట్టించుకోని అధికారులు



ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రంలో అన్ని కోర్సుల సెట్ల నోటిఫికేషన్లు వెలువడి ప్రక్రియ వేగవంతంగా ముందుకు సాగుతుండగా టీజీ సీపీజీఈటీ-2025 నోటిఫిషన్ జారీలో తీవ్ర జాప్యం నెలకొంటుంది. ఓయూతో పాటు జేఎన్‌టీయూ, కాకతీయ, శాతావాహన, తెలంగాణ, పాలమూరు, మహాత్మాగాంధీ, వీరనారీ చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ తదితర పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. సీపీజీఈటీని ఏటా ఉన్నత విద్యామండలి, ఓయూ సంయుక్త ఆధ్వర్యంలో పదేళ్లుగా నిర్వహిస్తున్నారు. అయితే కోవిడ్ సమయంలో సెలవుల కారణంగా విద్యా సంవత్సరం గాడి తప్పింది. సీపీజీఈటీ ప్రవేశ పరీక్షలు, ఫలితాలు, కౌన్సెలింగ్, తరగతుల ప్రారంభం, సెమిస్టర్ పరీక్షలు ఫలితాలు ఇలా ఒకదానితో ఒక్కటి ముడిపడి జాప్యం జరుగుతుండడంతో అన్ని వర్సిటీల్లో పీజీ కోర్సుల విద్యా సంవత్సరం గాడితప్పింది. తర్వాత పరిస్థితులు చక్కపడి విద్యా సంవత్సరం సాఫీగా సాగుతున్నా.. నాలుగేళ్లుగా పీజీ కోర్సుల విద్యా సంవత్సరం మాత్రం గాడిన పడలేదు. ఏటా 3 నెలలు ఆలస్యంగా పీజీ కోర్సుల విద్యా సంవత్సరం వెనకపడింది. దీంతో విదేశీ విద్యార్థుల సంఖ్య తగ్గడంతో పాటు పీజీ విద్యార్థులు వివిధ అవకాశాలు కోల్పోతున్నారు.

విద్యా సంవత్సరం జంపింగ్

పీజీ ప్రవేశాల జాప్యం వలన ఏటా ఈ విద్యా సంవత్సరం మరుసటి ఏడాదికి జంప్ చేస్తోంది. గతేడాది ప్రవేశం పొందిన పీజీ విద్యార్థులు ఈ విద్యా సంవత్సరం ముగియక ముందే మధ్యలోనే వేసవి సెలవులు వస్తున్నాయి. పీజీ కోర్సుల్లో ప్రవేశాల జాప్యం వల్లే ఈ సమస్య తలెత్తుతోంది. దీనిని సరిదిద్దేందుకు అవకాశాలు ఉన్నా రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో సమస్య అలానే కొనసాగుతోంది. ఈ విద్యా సంవత్సరమైన సకాలంలో నోటిఫికేషన్ విడుదల చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి పృథ్వీతేజ కోరారు.